నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం డిసెంబర్ 13, 2023 www.navatelangana.com

పేకాట స్థావరంపై దాడి

- రూ. 74,700 స్వాధీనం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దర్మోర గ్రామ శివారులో పేకాట స్థావరంపై టాస్క్ పోర్సు అధికారులు దాడి నిర్వహించి రూ. 74,700 స్వాధీనం చేసుకొని 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుదీర్ రావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం సీపీ ఆదేశాల మేరకు ఏసిపి టాస్క్ ఫోర్స్ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో సీఐ అజయ్ బాబు, సిబ్బంది నమ్మదగిన సమాచారంతో పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. మాక్లూర్ మండలంలోని పోలీసు స్టేషన్ పరిధిలో గల ధర్మోర గ్రామ శివారులో పేకాట స్తవరాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేయగా రూ.74,700/- సొత్తును స్వాధీనం చేసుకొని 17 మందిపై తదుపరి చర్య నిమిత్తము సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సుదీర్ రావు కు అప్పగించినట్లు తెలిపారు.

నీలాలో ముగ్గురికి డెంగ్యూ

నవతెలంగాణ-రెంజల్



జిల్లాలో డెంగ్యూ పంజా విసురుతోంది. తాజాగా రెంజల్ మండలం నీలా గ్రామంలో ముగ్గురికి డెంగ్యూ సోకినట్లు సమాచారం. తీవ్రమైన జ్వరంతో బాధపడుతు టెస్టులు చేయించుకోగా.. డెంగ్యూ సోకినట్లు నిర్ధారణ జరిగినట్లు సమాచారం వారు ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే వైద్య సిబ్బంది అప్రమత్తమవుతున్నారు. బుధవారం గ్రామాన్ని సందర్శించి వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిసింది. ఇటీవల నగరంలోని అంబేద్కర్ కాలనీలో డెంగ్యూతో చిన్నారి మృతిచెందిన ఘటన విషాదం నింపింది.

మా ఊరికేది.. మహాలక్ష్మి

- పలు గ్రామాలకు రాని బస్సులు
- తమకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్న ఆయా గ్రామాల మహిళలు
- ఉచిత బస్సు ప్రయాణానికి విశేష స్పందన
- రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య

నవతెలంగాణ-బోధన్

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మహాలక్ష్మి పథకం.. మహిళలకు కొండంత భరోసా ఇస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని మహిళలకు, పేదలకు ఎంతో తోడ్పడుతుంది. ఈ పథకం ప్రారంభంతో ప్రయాణికుల సంఖ్య అమాంతంగా పెరిగింది. అయితే పలు పల్లెలకు బస్సులు రావడం లేదు. వారు ఇప్పటికీ ప్రయివేటు వాహనాలను ఆశ్రయిస్తుంటారు. తమ గ్రామాలకు సైతం బస్సులను ఏర్పాటు చేసి తమకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాలని ఆయా గ్రామాల మహిళలు కోరుతున్నారు.

బోధన్ డిపో పరిధిలో పల్లెవెలుగు బస్సులు 53 ఉండగా, ఎక్స్‌ప్రెస్ బస్సులు 19 ఉన్నాయి. గతంలో డిపో పరిధిలో 26 నుంచి 28 వేల మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా.. కొత్త ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో ఆ సంఖ్య పెరిగింది. సోమవారం డిపో పరిధిలో మొత్తం 33,275 మంది ప్రయాణికులు తమ రాకపోకలు సాగించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. దాంతో పురుషుల కంటే మహిళల సందడే కనిపించింది. కండక్టర్లు మహిళలను ఇబ్బందులు పెట్టకుండా గుర్తింపు పత్రాలు అడగకుండా అనుమతిస్తున్నారు.

పలు గ్రామాలకు కలగా మారిన బస్సు సౌకర్యం

పథకం పట్ల అన్ని వర్గాల నుంచి విశేష స్పందన వస్తుంది. మహిళలకు ఎంతో తోడ్పాటు కల్పించినట్లు ప్రశంసలు అందుతున్నాయి. అయితే బస్సు ఎరగని గ్రామాల వారు.. బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. తమను మహాలక్ష్మి పథకంలో భాగస్వాములు చేయాలని కోరుతున్నారు.

బోధన్ నియోజకవర్గంలోని సాలూర మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా తగ్గెల్లి, ఫతేపూర్, కొప్పర్తి క్యాంప్, పాత సాలంపాడు గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దాంతో ఈ గ్రామాల మహిళలు ఉచిత బస్సు ప్రయాణం నష్టపోతునట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తగ్గెల్లి, ఫతేపూర్ గ్రామాలకు చెందిన మహిళలు సాలూర మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరం వరకు కాలినడకన గాని, ఇతర ప్రయివేటు వాహనాలల్లో రావాల్సి ఉంటుంది. అనంతరం బస్సు సౌకర్యం ఉంటుంది. అలాగే సాలూర క్యాంప్ నుండి పెంట ఖుర్దు వైపు వెళ్లే సందర్భంలో కొప్పర్తి క్యాంప్, పాత సాలంపాడు గ్రామస్తులు కిలోమీటర్ వరకు కాలినడకన నడుస్తూ ప్రధాన రహదారికి రావలసి ఉంటుంది. అప్పుడే వారికి బస్సు సౌకర్యం ఉంటుంది. నవీపేట్ మండలంలోని అబ్బాపూర్ (బి), ధర్మారం, అబ్బ పూర్ తాండ, రాంపూర్ గ్రామాలకు, అలాగే మట్టయ్య ఫారం, శివతండా, సలీం ఫారం, అంజుమన్ ఫారం, మురారి ఫారం, అల్లాపూర్, ఫతేనగర్ ,ఎల్.కే ఫారం లాంటి చిన్న చిన్న గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. దాంతో ఈ గ్రామాలకు చెందిన వందలాది మహిళలు ఉచిత బస్సు సౌకర్యం పొందలేక పోతున్నారు. రెంజల్ మండలంలోని బాగేపల్లి గ్రామానికి ఉదయం సాయంత్రం విద్యార్థుల సౌకర్యం మాత్రమే బస్సు సౌకర్యం ఉండడంతో రోజంతా బస్సులు రాక ఆ గ్రామ మహిళలు ఉచిత బస్సు ప్రయాణం నష్టపోక తప్పడం లేదు.

ఎడపల్లి మండలంలో అంబం (వై), ఆర్.పి క్యాంప్, జైతాపూర్, జంలం, ఠానా కలాన్, కుర్నాపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దాంతో ఈ గ్రామ మహిళలు మహాలక్ష్మి పథకం లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం పొందలేకపోతున్నారు. కావున అధికారులు స్పందించి ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల మహిళలు డిమాండ్ చేస్తున్నారు.



బోధన్ బస్టాండ్‌లో బస్ ఎక్కుతున్న మహిళలు

బస్సు సౌకర్యం కోసం వేచి ఉన్నాం

దేవేందర్, తగ్గెల్లి.



మా తగ్గెల్లి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు సౌకర్యం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం బాగానే ఉన్న మా గ్రామానికి బస్సు సౌకర్యం లేక ప్రభుత్వ ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మా గ్రామం మహిళలకు అందకుండా అయింది. కనుక ప్రభుత్వం స్పందించి మా తగ్గెల్లి గ్రామ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నాం.

ఫ్రీ బస్సు సౌకర్యం బాగుంది

లత, గాంధారి



కొత్త గవర్నమెంట్ ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం చాలా బాగుంది. నేను కామారెడ్డి జిల్లా గాంధారి ఎక్స్ రోడ్ నుండి బోధనకు వచ్చాను. బోధనలో గురుకుల హాస్టల్‌లో మా అబ్బాయి చదువుకుంటాడు. అతనిని చూడడానికి అంత దూరం నుంచి రావాలంటే గతంలో రెండు మూడు వందల రూపాయలు బస్సులకే ఖర్చు అయ్యేవి. దాంతో ఆర్థిక భారంతో ఇబ్బందులు పడిన పరిస్థితులు ఉన్నాయి. కానీ ఈ కొత్త ప్రభుత్వం మాలాంటి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి ఆదుకోవడం చాలా బాగుంది.

ఫ్రీగా వెళ్లే అవకాశం వచ్చింది

సుమలత, లక్కోర



మాది బాల్కొండ మండలం లక్కోర గ్రామం. బోధన్‌లో గల గురుకుల పాఠశాలలో నా కుమారుడు చదువుకుంటాడు. మా కుమారుడిని చూడడానికి అంత దూరం నుండి వచ్చినప్పుడల్లా కనీసం 400 రూపాయల వరకు ఖర్చయ్యేవి బస్సు కిరాయి, ఆటో కిరాయికి రెండు, మూడు వందలు ఖర్చు అయ్యేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం చాలా బాగుంది. దాంతో బోధన్ నుండి మా ఊరికి పోవడానికి నాకు ఫ్రీగా బస్సులో పోయే అవకాశం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

తగ్గెల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

లక్ష్మీ, తగ్గెల్లి సర్పంచ్



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం మంచిదే. తగ్గెల్లి, ఫతేపూర్ లాంటి మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఈ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పొందలేకపోతున్నాం. బస్సు కోసం మేము మూడు కిలోమీటర్ల దూరం వరకు ఆటోలలో కానీ నడుచుకుంటూ కానీ సాలుర వరకు వెళుతున్నాం. అలాంటప్పుడు మా గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పొందే అవకాశం లేకుంటే ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుంది. కావున మా గ్రామానికి ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

బస్సు కలగా మారింది

సర్పంచ్, షేక్ అమీర్.ఫతేపూర్



మా ఫతేపూర్ గ్రామానికి ఏనాడు కూడా బస్సు రాలేదు. మా ఊరికి బస్సు సౌకర్యం కలగానే మారింది. మా ఊరిలో విద్యార్థులు చదువుకోడానికి సాలూర మండల కేంద్రానికి 2.5 కి.మీ దూరం నడిచి పోవాలి. బోధన్ పోవాలంటే కూడా సాలూర వరకు ఆటోలో గాని నడుచుకుంటూ పోవలసిన పరిస్థితి ఉంది. మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు సౌకర్యం మా ఊరి మహిళలకు అందకుండా పోయింది. అధికారులు ఇప్పటికైన స్పందించి ఫతేపూర్ కు బస్సు సౌకర్యం కల్పించాలి.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

హత్య కేసులో ముగ్గురు నేరస్తులకు కామారెడ్డి కోర్టు జడ్జి ఎస్ ఎన్ శ్రీదేవి యావజ్జీవ కఠిన కారాగార శిక్షా, ఒక్కొకరికి 2,000 రూపాయల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ సింధు శర్మ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తేది. 03.11.2017 నాడు ఎల్లారెడ్డిలోని అజామాబాద్ గ్రామంలోని ఇడిగి పర్వ గౌడ్‌ను హత్య చేసిన కేసులో 1) చింతకాయల ఉషయ్య 2) చింతకాయల దుర్గయ్య 3) చింతకాయల సాయిలు, ముగ్గురి నివాసం అజామాబాద్ గ్రామం, ఎల్లారెడ్డి మండలం ముగ్గురిని నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేసి ఈ కేసులో రిమాండ్‌కు తరలించారు. పూర్తి సాక్షాధారాలను సేకరించి నేరస్తులపై అభియోగ పత్రము కోర్టు యందు సమర్పించగ ఇట్టి కేసులో న్యాయమూర్తి ఎస్, ఎన్.శ్రీదేవి, స్పెషల్ సెషన్ జడ్జ్ జిల్లా కోర్టు కామారెడ్డి సాక్షులను విచారించి, సాక్షాధారాలను పరిశీలించి నేరం నిరూపణ అయినందున ముగ్గురి నేరస్థులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షా, ఒక్కొకరికి 2,000 రూపాయల జరిమానా విధించారు. కేసులో పరిశోధన చేసిన నిందితులకు చట్టం ప్రకారం శిక్షపడేలా కృషి చేసిన ఎల్లారెడ్డి గత ఎస్ఐ సుధాకర్, ప్రస్తుత ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సాక్షులను త్వరితగతిన కోర్టు యందు హాజరుపరిచి, పర్యవేక్షించిన ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాస్, పోలీసు తరపున వాదనలు వినిపించిన పిపి రాజగోపాల్ గౌడ్, ప్రతిరోజూ కోర్ట్ యందు కేసు విషయాలను చూసుకున్న కోర్ట్ కానిస్టేబుల్ కిరణ్ గౌడ్ బాలకృష్ణ, కోర్టు లైసనింగ్ అధికారి బి. విట్టల్-యస్ ఐ, హన్మాండ్లు హెడ్ కానిస్టేబుల్ లను కామారెడ్డి జిల్లా యస్పి . సింధు శర్మ, ఐ.పి.యస్ ప్రత్యేకంగా అభినందించారు.

స్కూల్ సమీపంలోని వైన్స్‌ను తొలగించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలకు 100 మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేసిన ఎస్సార్ వైన్ షాపును వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం తెలంగాణ మాదిగ ఆకుల దండోరా ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఏవో కు వినతి పత్రాన్ని అందజేశారు. దండోరా నేషనల్ అధ్యక్షులు వేముల బలరాం మాదిగ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ముందు నూతనంగా ఏర్పాటైన ఎస్సార్ వైన్స్.. గౌతమ్ మోడల్ స్కూలుకు వంద మీటర్ల దూరంలోనే ఉందని సుమారు 200 మీటర్ల దూరంలో ఉండవలసిన వైన్స్ షాప్ 100 మీటర్ల దూరంలో ఉండడంతో స్కూల్లో చదివే పిల్లలకు ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. దగ్గరలోనే మోర్ సూపర్ మార్కెట్ ఉందని అక్కడికి వచ్చే మహిళలకు, పిల్లలకు ఈ వైన్ షాప్ వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆ వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. వెంటనే ఈ వైన్ షాపును ఇక్కడి నుంచి తొలగించకుంటే హెచ్ఆర్సీకి, మంత్రుల వద్దకు సైతం వెళ్లి వినతి పత్రాలను అందజేస్తామని తెలిపారు.

తల్లిదండ్రుల, సీనియర్ సిటిజన్ సంక్షేమ కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-కంఠేశ్వర్



కమిటీకి ఎంపికైన పలువురు

తల్లిదండ్రుల, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమం కోసం రూపొందించిన నిబంధనలను సమర్ధవంతంగా అమలు చేయడం కోసం కేంద్రం చట్టాన్ని రూపొందించింది. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వేతర సంస్థలు, సీనియర్ సిటిజెన్లతో జిల్లాస్థాయి కమిటీని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నియమించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, వివిధ శాఖల జిల్లా అధికారులు కమిటీ సభ్యులుగా నియమించారు. ఇందులో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు కమిటీ సభ్యులుగా నియమించారు. వీరితో పాటుగా భూమన్న, రాజేశ్వర్, భారతి, మేరీ, తదితరులు ఉన్నారు. ఆ మేరకు వయోవృద్ధుల, స్త్రీ, శిశు సంకేమ శాఖ జిల్లా అధికారి శ్రీమతి షేక్ రసూల్ బి నియామక పత్రాలను అందించారు.

గ్రామీణ తపాల ఉద్యోగుల సమ్మె షురూ

నవతెలంగాణ-ఆర్మూర్/సిరికొండ



ఆర్మూర్‌లో..

కనీస వేతనం అమలు చేయాలని, 8 గంటల పని విధానం అమలు చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తపాల శాఖ గ్రామీణ డాక్ సేవకులు సమ్మెను మంగళవారం ప్రారంభించారు. ఆర్మూర్ సబ్ డివిజన్ పరిధిలోని 18 సబ్ పోస్టాఫీసులలో పని చేస్తున్న బీపీఎంలు, ఏబీపీఎంలు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టినట్లు రాష్ట్ర నాయకులు లింబాగౌడ్, సబ్ డివిజన్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డిలు తెలిపారు. బీపీఎంలు, ఏబీపీలు సమ్మెబాట పట్టడంతో తపాలా సేవలు నిలిపివేయడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురైనారు. చాలా ఏళ్ల నుండి చాలీచా లని వేతనంతో తపాల శాఖలో సేవలందిస్తున్న వేతన జీవుల కష్టాలు వర్ణణాతీతమన్నారు. కేంద్ర ప్రభుత్వం తపాలశాఖలో జీడీఎస్ లతో వెట్టి చాకిరీ చేయించుకుం టున్నారని, ఈ వెట్టిచాకిరీతో తమకు ఎలాంటి ప్రయోజ నాలు చేకూరడం లేదని వాపోయారు.పెన్షన్ లేక చాలీ చాలని వేతనాలతో జీవితాన్ని గడుపుతున్నామని, రిటైర్మెం ట్ తర్వాత పెన్షన్ లేక చాలీచాలని వేతనాలతో జీవితాన్ని గడుపుతున్నామన్నారు. రెగ్యులరైజేషన్ , గ్రాట్యూటీ లేక, వైద్య సౌకర్యం లేక జీడీఎస్‌లు అనేక ఇబ్బం దులు పడుతు న్నారని, తపాల శాఖ తమపై టార్గెట్లు ఇస్తూ వాటిని పూర్తి చేయాలని లేనిచో పనిష్మెంట్ ఉంటుందని హెచ్చరిస్తూ భయాందోళనల మధ్య ఉద్యోగ వీధులు నిర్వహిస్తున్నామన్నారు. కనీస వేతనానికి దూరమైన తాము మొబైల్ ఫోన్లను ఉపయోగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమ డిమాండ్‌లను సాధించే వరకూ నిరవదిక సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీపీఎంలు శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకటేష్, రవీందర్, జగదీశ్, వేణు గోపాల్ సత్యనారాయణ, ఏబీపీఎంలు రాజేష్ , భూషన్ ,పవన్ ,రాము, నరహరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాల ఉద్యోగుల నిరవధిక సమ్మె

సిరికొండ : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గ్రామీణ తపాల ఉద్యోగులు వారి డిమాండ్ల సాధన కోసం మంగళవారం నుండి నిరవధిక సమ్మె మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో తపాల ఉద్యోగులు వారి డిమాండ్లను పరిష్కరించాలని నిరవదిక సమ్మెలో పాల్గొన్నారు. 8 గంటల పని, పెన్షన్ మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాటిట్యూడ్ 5 లక్షలకు పెంచాలని, జీడియస్ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు.




సిరికొండలో..

పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి

- డాక్టర్ రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-కామారెడ్డి





పిల్లలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు రాజ్యాలక్ష్మి

ఆడపిల్లలు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని కామారెడ్డి రాజ్యలక్ష్మి నర్సింగ్ హెూమ్, వైద్యురాలు రాజ్యలక్ష్మి విద్యార్థినులకు సూచించారు. మంగళవారం రాజంపేట్ మండల కేంద్రంలో గల కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థినులకు ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత, రుతుక్రమం సమస్య వస్తే దానిని ఎలా ఎదుర్కోవాలనే విషయాలను విద్యార్థినులకు వివరించారు. రక్త పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రావణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మా పొట్టకొట్టొద్దు

- ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి
- అప్పటి వరకు జీవన భృతి రూ.15 వేలు చెల్లించాలి
- పలుచోట్ల ఆటోడ్రైవర్ల ఆందోళన.. వినతి

నవతెలంగాణ-విలేకరులబృందం

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించి మా పొట్టకొడుతుందని ఆటోడ్రైవర్‌లు వాపోయారు. తమ గోడును విన్నవించి తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూడాలని కోరారు. అంతవరకు జీవన భృతి రూ. 15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం పలు చోట్ల నిరసనలు, ఆందోళనలు వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

నెలకు 15 వేల జీవన భృతి ఇవ్వాలి..

కామారెడ్డి : ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం చేయడంతో మా ఆటోలలో మహిళలు ఎక్కడం లేదని, తమకు కుటుంబ పోషణ ఆర్థిక భారంగా మారిందని, తమను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని ఆటో డ్రైవర్‌లు కోరారు. మంగళవారం కామారెడ్డి మండలంలోని గార్గుల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లు కామారెడ్డి-రామారెడ్డి రోడ్డుపై గర్గుల్‌లో రాస్తారోకో చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెట్టకుండా ప్రతి మహిళకు బస్సులో ఉచిత ప్రయాణం చేయడంతో తమ ఆటోలలో ఎవరు ఎక్కడం లేదని దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందనీ అన్నారు. ఆటోలు నడిస్తే కానీ తమ కుటుంబాలు గడవని పరిస్థితి ఉందన్నారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని , అప్పటి వరకు నెలకు 15 వేల రూపాయల జీవన భృతి ఇవ్వాలని కోరారు. ఈ రాస్తారోకోలో ఆటో డ్రైవర్లు స్వామి గౌడ్, రాజిరెడ్డి, నారా గౌడ్, సంజీవ చారి, శంకర్, శ్రీనివాస్, సాయికుమార్, చందు, హరీష్ యాదవ్, లింగం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తమకు గిరాకీ లేకుండా పోయిందని, రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మద్నూర్ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఆటో డ్రైవర్లంతా భారీ ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళన మద్నూర్ మండల ఆటో యూనియన్ అధ్యక్షులు షేక్ ముజాహిద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆందోళనకు బిచ్కుంద, జుక్కల్ మండలాలకు చెందిన ఆటో యూనియన్ అధ్యక్షులు హాజరై పాల్గొన్నారు. మహాలక్ష్మి పథకం అమలు చేసిన నాటి నుంచి ఏ ఒక్క ప్రయాణికులు ఆటోలు ఎక్కడంలేదని, దీంతో తమకు రోజువారి కూలి కూడా పడట్లేదని తెలిపారు. ఆటోలకు గిరాకి లేక, ఫైనాన్స్ డబ్బులు కట్టలేక, ఇంటి అద్దెలు చెల్లించలేక, పిల్లల చదువులకు ఫీజులు కట్టలేని పరిస్థితి నెలకొందని అన్నారు. మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని తమను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆటో, టాక్సీ డ్రైవర్స్‌ను ఆదుకోవాలి

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆటో డ్రైవర్స్, టాక్సీ డ్రైవర్స్ తమను ప్రభుత్వం ఆదుకోవాలని మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడినా ప్రభుత్వం మహిళకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేయటంతో తమ ఆటోలను, ట్యాక్సీలను నడపలేని స్థితిలో ఉన్నామన్నారు. తమ జీవితాలు, కుటుంబసభ్యుల జీవితాలు తమపై ఆధారపడి వున్నాయన్నారు. తమ కష్టాలను తెలుసుకొని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఆటో డ్రైవర్స్, ట్యాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.



కామారెడ్డిలో రాస్తారోకో చేపట్టిన ఆటో డ్రైవర్‌లు

ఆటో డ్రైవర్‌ల రాస్తారోకో.. ప్రయివేటు బస్సు అడ్డగింత

ఎడపల్లి : ఎడపల్లి మండల కేంద్రంలోని మంగళ్ పహాడ్ చౌరస్తా వద్ద మంగళవారం ఆటోడ్రైవర్‌లు రాస్తారోకో చేపట్టారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు తమ ఆటోలను ఆశ్రయించడం లేదని, దీంతో డీజిల్ ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అందరూ ఆటోలను ఎక్కుతుండటంతో తమకు గిట్టుబాటు అయ్యేదని, ప్రస్తుతం కావడం లేదని దీంతో తమ ఆటో ఛార్జీలు సైతం పెంచాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. ఆటో యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్షులు నెల్లిరాజు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పొద్దంతా ఆటోలో ఖాళీగా కూర్చొని ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు.

ప్రయివేటు బస్సు అడ్డగింత

ఎడపల్లి మండల కేంద్రంలోని మంగళవారం వారం సంత సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంతకు చేరుకున్నారు. అయితే ఆటో డ్రైవర్లు రోజువారికంటే అధికంగా 10 రూపాయలు ఎక్కువ కిరాయి తీసుకున్నారు. ఇంతలో బోధన్ పట్టణానికి చెందిన ఓ ప్రయివేటు స్కూల్ బస్సు.. ప్రయాణికులను ఎక్కించుకోవడంతో ఆటో డ్రైవర్‌లు అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్ ప్రయాణికులను దించేశారు. ఇంతలో బోధన్ డిపో ఆర్టీసీ బస్ రావడంతో మంగళ్ పాడ్ సంతకొచ్చిన ప్రజలు బస్సులో ఎక్కి మంగళ్‌పాడ్‌కు చేరుకున్నారు. ఆర్టీసీ బస్సును అడ్డుకోలేదు.



మద్నూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్‌లు..



ఎల్లారెడ్డిలో వినతిపత్రం అందజేస్తున్న ఆటో, టాక్సీ డ్రైవర్‌లు



ఎడపల్లిలో రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్‌లు

నవతెలంగాణ
నిజామాబాద్
బుధవారం | డిసెంబర్ 13, 2023 | www.navatelangana.com

శ్రీరామ్ లైఫ్ బీమా క్లెయిమ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



శ్రీరామ్ లైఫ్ బీమా క్లెయిమ్ 6,60వేలు మండలంలోని పడకల్‌కు చెందిన వ్యక్తికి మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేతుల మీదుగా అందజేసినట్టు శ్రీరామా లైఫ బీమా డివో ప్రసాద్ తెలిపారు.

ఆర్మూర్‌కు చెందిన పత్రి కిషన్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 8 నెలల క్రితం ఏఐపి పాలసీ తీసుకున్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించారు. నామిని ఐన భార్య పత్రి విజయకి బీమా చెక్ అందజేశారని ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒకరు బీమా చేయించుకొని కుటుంబానికి ఆర్థికభద్రత, ఆర్థిక పొదుపు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు నిజామాబాద్ ఏజీఎం సతీష్, డియం నగేష్, మేనేజర్ అనిల్, ఆర్మూర్ మేనేజర్ సందీప్, ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపిన వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటైన నూతన మంత్రివర్గంలో పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సీతక్కను పిసిసి అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాదులో మంత్రి సీతక్కను తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్క గొప్ప పోరాటయోధురాలని, అణగారిన వర్గాల ప్రజలను అక్కున చేర్చుకోవడంలో సీతక్క ఎల్లవేళలా ముందుంటారని ఈ సందర్భంగా వేణుగోపాల్ యాదవ్ పేర్కొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను తొలగించండి

- కలెక్టర్‌ను కలిసిన కౌన్సిలర్లు
- అవిశ్వాస పత్రం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్‌ను పదవి నుండి తొలగించాలని కోరుతూ 26 మంది కౌన్సిలర్లు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ను కలిశారు. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నేతృత్వంలో క్యాంపులో ఉన్న అసమ్మతి కౌన్సిలర్లు మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెడుతూ 26 మంది బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాస పత్రాన్ని అందజేశారు.



కలెక్టర్‌కు అవిశ్వాస పత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

త్వరలోనే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

తమ వార్డులు అభివృద్ధికి నోచుకోలేదని...

మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని సైతం కలిసి చైర్ పర్సన్, మరిది ఆగడాలపై వివరించారు. వీరి నియంతృత్వ ధోరణి నుండి విసిగి వేసారినట్టు తెలిపారు. తాము చెప్పిందే శాసనం అన్నట్లు ప్రవర్తించారని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు అసహించుకునే విధంగా మూడోస్థానంలో తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సర కాలంలో మంచి పాలన అందించే వ్యక్తిని చైర్పర్సన్‌గా నియమిస్తే తమ వార్డులు అభివృద్ధి జరుగుతాయని, రాబోయే పార్లమెంట్, మున్సిపల్ ఎన్నికలలో తమ వార్డులలో అభివృద్ధి జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ పండిత్ వినీత మాట్లాడుతూ కొంతమంది కావాలనే తమపై అవినీతి ఆరోపణలు చేస్తూ అవిశ్వాసానికి తెరలేపారని, రానున్న రోజుల్లో ఐదు సంవత్సరాల పదవి కాలాన్ని పూర్తి చేస్తామని అన్నారు. కొంతకాలంగా అసహనంతో ఉన్న సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాసం ప్రవేశపెట్టడం తీవ్ర చర్చనీయాంశం అయింది.

ఖోఖో జాతీయస్థాయికి విద్యార్థిని సుజాత ఎంపిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఖోఖో జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థిని సుజాత

నిజామాబాద్ జిల్లా ఖోఖో ఎస్‌జిఎఫ్ అండర్-19 జాతీయస్థాయికి డిచ్ పల్లి మండలంలోని దర్మారం (బీ) గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థిని సుజాత ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత మంగళవారం తెలిపారు. ఈనెల 25 నుండి 27 వరకు వరంగల్ జిల్లా తొర్రూరులో జరిగిన బాల బాలికల స్కూల్ గేమ్ ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ లెవెల్ ఖో ఖో పోట్లీట్ల మంచి ప్రతిభ కనబర్చిన సుజాతను ప్రిన్సిపల్ సంగీత అభినందించారు. ఈనెల 13 నుండి 16 వరకూ మహారాష్ట్రలో నాసిక్ లో నిర్వహించే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటుందని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి తెలిపారు. విద్యార్థినిని పాఠశాల పిఈటీ జోష్న, హౌస్ టీచర్స్ చెన్నకేశ్వరి, సిబ్బంది అభినందించారు.

జీజీ కాలేజ్ పీజీ కోర్సు ఫీజు ప్రభుత్వమే చెల్లించాలి

- పీడీఎస్‌యూ



వినతి పత్రాన్ని అందజేస్తున్న పిడిఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ కాలేజ్‌లో పీజీ చదువుతున్న విద్యార్థులకు కోర్స్ ఫీజు మొత్తం ప్రభుత్వమే భరించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జి జి కళాశాలలో పిడి ఎస్ యూ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని ముట్టడించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జి జి కాలేజీలో పీజీ విద్యార్థులకు కోర్స్ ఫీజు సంవత్సరానికి 36వేలు ఉంటే ప్రభుత్వం కేవలం 20వేలు మాత్రమే ఇస్తుందని, మిగతా 16వేలు సంవత్సరానికి విద్యార్థులే కట్టాలని ప్రిన్సిపాల్ హుకుం జారీ చేశారని అన్నారు. ట్యూషన్ ఫీజు కట్టకపోతే సెమిస్టర్ ఫీజులు కట్టించుకోవడంలేదని, విద్యార్థుల నుంచి ఫీజుల దోపిడీ చేస్తూ ఒక్క డిపార్ట్మెంట్ మెంట్‌కి ఇద్దరే లెక్చరర్లు పాఠాలు చెబుతున్నారని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్స్ లు పెట్టి సరిపడా లెక్చరర్స్, ల్యాబ్ సౌకర్యాలు లేకుండా విద్యార్థుల నుండి కట్టిన ఫీజులు ఎటుపోతున్నాయని ప్రశ్నించారు, మూడో సెమిస్టర్ సిలబస్ ఇంకా పూర్తి కాలేదని, పరీక్షల షెడ్యూలు ఇచ్చేశారని అన్నారు. సిలబస్ పూర్తయ్యేంతవరకు పరీక్షలు నిర్వహించద్దని డిమాండ్ చేశారు. ఎగ్జామ్ ఫీజు తేదీని పొడిగించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా కోశాధికారి దేవిక, రాజు, విద్యార్థులు అఖిల, సుబుర్, నిదా, మేఘన, ప్రవీణ్, సంజీవ్, ఆకాష్, ఉమేష్, ప్రవీణ్, వందమంది పాల్గొన్నారు.

టీయూలో ప్రీపిహెచ్‌డీ పరీక్ష ఫలితాలు వెల్లడి



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి,తదితరులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో అక్టోబర్ 5 నుండి 7వ వరకు జరిగిన ప్రీపీహెచ్‌డీ పరీక్ష ఫలితాలను రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్.యం యాదగిరి, పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్. ఎం.అరుణ మంగళవారం విడుదల చేశారు.16 సబ్జెక్టుల్లో 137 మంది పీహెచ్డీ స్కాలర్స్ పరీక్షకు హాజరుకాగా 134 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ పరీక్ష ఫలితాల విడుదల కార్యక్రమంలో పీజీ కాన్ఫెన్షియల్ అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ బి. సాయిలు,ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ గంట చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. సిహెచ్. అరతి, ప్రొఫెసర్ కే.అపర్ణ, ప్రొఫెసర్ లావణ్య డైరెక్టర్ పి ఆర్ ఓ డాక్టర్ ఏ పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్, రెగ్యులర్

పరీక్షల ఫీజు అపరాధ రుసుం గడువు పెంపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల పరిధిలోని ఎంఎ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సి, ఎంకామ్, ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం కోర్సులకు మరియు ఐదు సంవత్సరాల కోర్సులు (ఏపి ఈ, పిసిహెచ్, ఐఎంబిఏ,) మూడవ, ఐదవ, ఏడవ, తొమ్మిదవ రెగ్యులర్ సెమిస్టర్ పరీక్ష ఫీజును అపరాధ రుసుంతో పొడిగించినట్లు యూనివర్సిటీ పరీక్షల నియం త్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లించుటకు చివరి తేదీ గతంలో 12-డిసెంబర్ ఉండగా దానిని 15- వరకు పొడిగించినట్లు వివరించారు. 100 రూపాయల అపరాధ రుసుంతో 18-డిసెంబర్ వరకు చెల్లించడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ లను సంప్రదించాలని, ఇందుకు సంబంధించిన వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందని కంట్రోలర్ తెలియజేశారు.

భీముని మందిర నిర్మాణానికి

- భూమి కేటాయించాలని వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని అమ్సన్ పల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 2005 లోగల భూమిని భీముని మందిర నిర్మాణానికి కేటాయించాలని కోరుతూ మంగళవారం ఆదివాసి నాయకపోడ్ (ఎస్టీ) సేవా సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ వెంకట్రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భీముని గుట్టగ పిలువబడె ఈ ఖాళీ స్థలంలో మందిర నిర్మాణం కోసం పట్టా ఇవ్వాల్సిందిగా ఆదివాసి నాయకపోడ్ (ఎస్టీ) సేవా సంఘ సభ్యులు కోరారు.

నిజమైన పోరాట యోధుడు యువరాజ్ సింగ్

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- జన్నేపల్లిలో యువికెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- నిరుపేదలకు, విద్యార్థులకు సహకారం, రక్తదానం

నవతెలంగాణ-నవీపేట్

యువరాజ్ సింగ్ క్రికెట్లోనే కాకుండా క్యాన్సర్ తో పోరాడిన వీరుడని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని జన్నేపల్లిలో క్రికెటర్ యువరాజ్ సింగ్ జన్మదినం సందర్భంగా యువికెన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుజన్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, బుక్కులు, నిరుపేదలకు ఆర్థిక సహకారం, బియ్యం బస్తాలు పంపిణీ రక్తదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే లక్షలాదిమంది



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ మ్మెల్యే భూపతిరెడ్డి

ఆదరాభిమానాలు పొందిన క్రికెటర్ యువరాజ్ సింగ్ అని అన్నారు. క్రికెట్ ఆటతో పాటు క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన గొప్ప పోరాట యోధుడు యువరాజ్ సింగ్ అని అన్నారు.

యువరాజ్ సింగ్ అభిమానులు ఆయన పేరుపై యువికెన్ ఫౌండేషన్ స్థాపించి గత 13 సంవత్సరాలుగా సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం తరపున సైతం ఆరోగ్యశ్రీకి పది లక్షలు పెంచి రోగులకు సహకరిస్తున్నామని యువీకెన్ సంస్థకు భవిష్యత్తులో తన సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. 13 సంవత్సరాలుగా అనేక రకాలుగా సేవలందిస్తున్న సర్పంచ్ సుధాకర్ రావుతో పాటు తనయుడు సుజన్ కుమార్‌ను ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్ పలువురు ప్రశంసించారు. అనంతరం నిరుపేదలైన 20 మందికి 5000 చొప్పున ఆర్థిక సహకారం, 25 మందికి 25 కిలోల బియ్యం బస్తాలు, వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 245 మందికి పేద విద్యార్థులకు బ్యాగులను, బుక్కులను అందజేశారు. అలాగే రక్తదానం చేశారు. అంతకుముందు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సబితా రావు, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, బాబు, మోహన్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

41 నాయక్‌పోడ్ కుటుంబాల బహిష్కరణ..?



నవతెలంగాణ-బాల్కొండ

గ్రామపంచాయతీ భవన నిర్మించాల్సిన స్థలంలో అక్రమంగా కుల సంఘం భవనం నిర్మాణం చేపట్టేందుకు యత్నించగా.. అడ్డుకున్నందుకు తమ 41 నాయక్‌పోడ్ కుటుంబాలను గ్రామంలో సాంఘీక బహిష్కరణ విధించారని నాయక్‌పోడ్‌లు వాపోయారు. బాల్కొండ మండలంలోని బస్సాపూర్ గ్రామానికి చెందిన నాయక్‌పోడ్ కులస్తులు మంగళవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని బస్సాపూర్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన గ్రామపంచాయతీ భవనాన్ని (గతంలో గ్రామ కమిటీ హాల్) ను తొలగించారు. ఆ ఖాళీ స్థలంలో మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే సెప్టెంబర్ 10 న 20 లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవనం కోసం భూమి పూజ చేశారు. ప్రస్తుతం ఆ ఖాళీ స్థానాన్ని ఓ కుల సభ్యులు కబ్జా చేసి అక్రమంగా కుల సంఘ భవనం నిర్మిస్తున్నారని వాపోయారు. దీనిపై ప్రశ్నించి అడ్డుకున్నందుకు తమను బహిష్కరించారని తెలిపారు. నాయక పోడు కులస్థుల జీవనోపాధి కోసం వ్యవసాయం చేస్తున్న ట్రాక్టర్లలో ఆ కులసంఘం సభ్యులు ఎవరైనా ఎక్కితే జరిమానా విధిస్తామని, వారి కిరాణా దుకాణాల్లోకి ఎవరు వెళ్ళవద్దని, మల్లన్న గుడిలోకి ఎవరు కూడా రావద్దని ఆంక్షలు విధించారని అన్నారు. ఈ నిర్మాణంపై గ్రామపంచాయతీ కార్యదర్శి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని నాయకపోడు కుల సంఘ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని నిలిపివేసి తమ గ్రామానికి న్యాయం చేయాలని నాయకపోడు కుల సంఘ సభ్యులు కోరారు.

రైతాంగ ఉద్యమ నేతలపై నిర్బంధం చేస్తే

పోరాటాలతో బుద్ధిచెప్తాం

- ఎస్‌కేఎం
- కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఢిల్లీలో 13 నెలల పాటు జరిగిన రైతుల పోరాటంపై, రైతు నాయకులపై కక్షపూరితమైన వైఖరి అవలంబిస్తూ నాయకత్వంపై అక్రమ కేసులు నిర్బంధం ప్రయోగించడాన్ని తక్షణమే వెనక్కి తీసుకొవాలని, నిర్బంధం ప్రయోగిస్తే ఐక్యరైతాంగ పోరాటాలతో ప్రతిఘటిస్తామని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం(ఏఐపీకేఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవారం హెచ్చరించారు. మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్వదేశీ, విదేశీ కార్పొరేట్‌కు మోడీ ప్రభుత్వం పూర్తిగా గులాంగిరి చేస్తూ రైతులు, వ్యవసాయ కార్మికులు గ్రామీణ పేదల ప్రయోజనాలను తాకట్టు పెడుతుందన్నారు. కేంద్రప్రభుత్వ విధానాలకు



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

వ్యతిరేకంగా రైతాంగం ఐక్యంగా దీర్ఘకాలికంగా పోరాటాలు చేస్తే మోడీకి తగిన బుద్ధి చెప్తామని అన్నారు. న్యూస్ క్లిక్ ఎఫ్ఐఆర్‌లో రైతుల పోరాటాన్ని దేశ వ్యతిరేక పోరాటంగా చిత్రీకరిస్తూ తీవ్రవాద శక్తుల నిధులతో నడిచిన పోరాటంగా వక్రీకరిస్తూ ఆరోపణలు చేస్తూ రైతాంగ ఉద్యమంపై నిర్బంధం నియంతృత్వం ప్రయోగిస్తుందన్నారు. కేంద్రం పోరాడే హక్కులను కాలరాస్తుందన్నారు. కేంద్ర ప్రధాని మోడీ తన కుట్రపూరిత విధానాలు విడనాడి రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న నాయకులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే మరో ఐక్య రైతాంగ పోరాటాలకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం జిల్లా నాయకులు పెద్దివెంకటరాములు, భాస్కర్, పి.వెంకటేష్, ఏ.రాజేశ్వర్, వేల్పూర్ భూమయ్య, బి. భాస్కర్, బి. బాబన్న, జి. కిషన్, ఎ.అశోక్, సి.హెచ్. సాయగౌడ్, బొంబాయి గంగారాం, సాయిరెడ్డి, నజీర్, డి. గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పడకల్‌లో ప్లెక్సీ చించివేత

- దళితులను రాజకీయంగా ఎదగకుండా చేస్తున్నారు
- ఎమ్మెల్యే అభిమాని ప్రసాద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



చించివేసిన ప్లెక్సీ

మండలంలోని పడకల్ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించివేసి దళితులను రాజకీయంగా ఎదగకుండా చేస్తున్నారని ఎమ్మెల్యే అభిమాని ప్రసాద్ ఆరోపించారు. పడకల్ గ్రామంలో ఇటీవల కాంగ్రెస్ కార్యకర్త సుర్భిర్యాల ప్రసాద్ భూపతిరెడ్డి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఫ్లెక్సీలోని ప్రసాద్ ఫొటోను చించి వేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. దళితులు రాజకీయంగా ఎదుగుతున్నారని అసూయతో చించివేశారని దుండగులను కఠినంగా శిక్షించాలని అధికారులను కోరారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

- గ్రామీణ ఉద్యోగులు సమ్మె

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సబ్ పోస్ట్ ఆఫీస్ కింద పనిచేస్తున్న గ్రామీణ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్ద సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ ఈ సమ్మెలో నేషనల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సమ్మె డిమాండ్లను పరిష్కరించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఎనిమిది గంటల డ్యూటీ, పింఛన్ సౌకర్యం కల్పించాలని, సిబ్బందిని రెగ్యులేషన్ చేయాలని, కుటుంబ సభ్యులకు అనారోగ్యం పాలైతే



సమ్మెలో పాల్గొన్న గ్రామీణ ఉద్యోగులు

వసతి కల్పించాలని, కమిషన్ బేసిన్ తొలగించి వర్క్ లోడ్ కిందికి తీసుకోవాలని, 12, 24, 36 ఏళ్ల సర్వీస్ ఉన్నవారికి అదనంగా ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ 5 లక్షల రూపాయలకు పెంచాలని, గ్రాట్యుటీ 5 లక్షలకు పెంచాలని, తమపై టార్గెట్ బలవంతంగా చేయించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. పైడిమాండ్ల పార్లమెంట్ సమావేశంలో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు రాజన్న, కార్యదర్శి పండరినాథ్, క్యాషియర్ కొయ్యరవి, సుద్దపల్లి, యానంపల్లి, పడకల్, కంజర్, కులాస్‌పూర్, దూస్గాం, జక్రాన్‌పల్లి, కేశ్‌పల్లి, కలిగోట్, సికింద్రా పూర్, కోరట్పల్లి, మైలారం, నడిపల్లి, అమృతాపూర్, గొల్లపల్లి, ముల్లంగి, మెంట్రాజ్‌పల్లి, మాదాపూర్ గ్రామ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు సమ్మెలో పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు



గ్యాస్ ఏజెన్సీల ముందు క్యూలో నిలబడిన వినియోగదారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పలు గ్యాస్ సిలిండర్ ఏజెన్సీల వద్ద మంగళవారం వినియోగదారులు బారులు తీరారు. ఈ కేవైసీ చేయించుకుంటేనే గ్యాస్ సిలిండర్ 500 కే వస్తుందని వినియోగదారులు ఏజెన్సీల వద్దకు బారులు తీరారు. ఏజెన్సీ నిర్వాహకులు ఈ కేవైసీ కి గడువు ఇంకా ఉందని వినియోగదారులకు చెబుతున్న పట్టించుకోవడం లేదు. ఆధార్ లింకేజీ కోసం ఈ కేవైసీ చేయించుకోవాలని ఆయిల్ కంపెనీలు ప్రకటించగా కొందరు ఈ విషయంలో అపోహ పడుతూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఉజ్వల యోజన కింద గ్యాస్ సిలిండర్ పొందిన వినియోగదారులు డిసెంబర్ 31 వరకు ఈ కేవైసీ చేయించుకోవాలని ఇంకా ఈ గడువును పెంచే అవకాశం కూడా ఉందని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్న ప్రజలు ఏజెన్సీల వద్దకు పరిగెత్తుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తుందని అపోహతో ప్రజలు ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు చాలామంది పేదలు పనులు వదిలేసి భారీ క్యూ లైన్ లో నిల్చొని ఈ కేవైసీ చేయించుకుంటున్నారు.

ప్రభుత్వ సంపదను దోచేస్తున్న వారిపై

సిబిసీఐడితో విచారణ జరిపించాలి

- ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరపడంవల్ల ప్రకృతి సమతుల్యం దెబ్బతినడమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతుందని ప్రభుత్వ సంపదను దోచేస్తున్న వారిపై సిబిసీఐడితో విచారణ జరిపించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంకాపూర్ స్వగృహంలో మంగళవారం మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతుల ప్రకారం వ్యాపారాలు చేసుకోవాలని, క్వారీల పేరిట అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయలు దోచేస్తుంటే చట్టం చూస్తూ ఊరుకోదని అన్నారు. నియోజకవర్గంలోని క్వారీలు, క్రషర్లను పరిశీలించవద్దంటూ తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, తాను ఎవరి బెదిరింపులకు భయపడేది లేదని అన్నారు. ఎలాంటి అనుమతులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

లేకుండా క్వారీని నిర్వహిస్తున్న యజమానులు ప్రభుత్వానికి పన్నులు చెల్లించాలని, ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరనున్నట్టు తెలిపారు. మైనింగ్ నిర్వాహకులు కొండలను పగులు కొట్టడానికి భారీ బాంబులను ఉపయోగించడం వల్ల సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వీటన్నింటికీ కారణం మాజీ ఎమ్మెల్యే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

15న ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్స్‌ను ఆదుకోవాలని ఈనెల 15 శు పట్టణంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు బుధవారం ఆటో డ్రైవర్స్ యూనియన్ డివిజన్ గౌరవ అధ్యక్షులు (ఏఐటీయుసి) డివిజన్ నాయకులు అరేపల్లి సాయిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి గెలిపించిన పాపానికి ప్రమాదంలో మరణించిన ఆటో డ్రైవర్స్ కు 5లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పి మోసం చేశారని పేర్కొన్నారు. మోసపూరిత కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ది చెప్పాలని ఆటో డ్రైవర్స్ కాంగ్రెస్ ను గెలిపించుకుంటే బస్ లలో మహిళలకు ఉచిత ప్రయాణం చేయడం వల్ల ఆటో డ్రైవర్స్ కు ఉపాధి లేకుండ పోయిందని వాపోయారు.

ఎమ్మెల్యే మదన్మోహన్‌రావును సన్మానించిన సర్పంచ్



నవతెలంగాణ-రామారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల మదన్మోహన్ రావును, పోసానిపేట్ సర్పంచ్ గిరెడ్డి మహేందర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధితో పాటు, మండల అభివృద్ధికి ఎమ్మెల్యే పూర్తి సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్ మోహన్‌రావు ఎమ్మెల్యేగా గెలిస్తే 101 కొబ్బరికాయలు కొడతానని ఎల్లారెడ్డి పట్టణంలోని పోసానిపల్లి వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు రమేష్ మొక్కుకున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా కె.మదన్ మోహన్‌రావ్ గెలవటంతో మంగళవారం హనుమాన్ ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి కొబ్బరికాయలను కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల యూత్ ప్రెసిడెంట్ హజార్, ఖాద్రి, ఇలియాస్, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విత్తన శుద్ధి తప్పనిసరి



- వ్యవసాయ శాస్త్రవేత్తలు
- యాసంగి పంటలపై రైతులకు శిక్షణ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రైతులు నారుపోసేముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం మండలంలోని అజమాబాద్ గ్రామంలో యాసంగి పంటలపై శాస్త్రవేత్తలు రేవంత్ నాథన్, అనిల్ రెడ్డి రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాసంగిలో వరి నారుమడులు, నాటు వేసిన తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు నారుమడి వేయడానికి ముందు విత్తన శుద్ధి చేసుకుని విత్తుకోవాలని తెలిపారు. విత్తన శుద్ధికి కిలో వరి విత్తనానికి ఒక గ్రాము కార్బన్డిజం అనే మందుతో శుద్ధి చేసుకోవాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నారుమడిలో కాండం తొలిచే పురుగు, ఆకు చుట్టు పురుగు తల్లి పురుగులను గుర్తించిన వెంటనే క్లోరోపైరి పాస్ అనే మందు ఒక పంపుకు 50 ఎంఎల్ పిచికారీ చేయాలని సూచించారు. నారుమడి నుంచి నాటు వేయడానికి వారం రోజుల ముందు నారుమడికి ఒక కేజీ కార్బోఫ్యూరాన్ 3శాతం గులకలు వెయ్యాలని సూచించారు. నారుమడిలో జింకు లోపం నివారణకు జింకు సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని అన్నారు. అదేవిధంగా నాటు వేసే పొలంలో ఒక ఎకరానికి 10 కిలోల జింకు సల్ఫేట్ వెయ్యాలని బస్వారం, నత్రజని, పొటాష్ ఎరువులు దమ్ము చేసుకునే ముందర పొలంలో వేసుకోవాలని తెలిపారు. నారుమడి క్షేత్రాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో అజామాబాద్ సర్పంచ్ గొట్టం సాయిలు, ఉపసర్పంచ్ పట్లోళ్ల కిష్టయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లారెడ్డి, అన్నా సాగర్ రైతుబంధు కోఆర్డినేటర్ నారాయణ, పెద్దగొల్ల గంగారం, సొసైటీ డైరెక్టర్ పంతులు రాములు, లక్ష్మీనారాయణగౌడ్, లచ్చ గౌడ్, కుమ్మరి గంగారం, రాజిరెడ్డి, పెసటి రాజులు, నర్సారెడ్డి, బాల్ రెడ్డి, ఎస్ లక్ష్మణ్, యాదగిరి, తదితర రైతులు పాల్గొన్నారు.

పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-వర్ని(చందూర్)

బాన్సువాడ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి లక్ష్మాపూర్ సర్పంచ్ సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛాలను అందించారు. గ్రామ కార్యకర్తలకు స్పీకర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాములు, సాయిలు తదితరులున్నారు.

వ్యవసాయంపై సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ జిల్లా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు. రైతుబంధు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, రైతుబీమా, ఆయిల్‌ఫామ్, పంట నమోదు, క్వాలిటీ కంట్రోల్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అన్ని డివిజన్‌ల ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

వెలుతురు వచ్చేలా చర్యలు తీసుకోవాలి

- కార్యదర్శికి ఫిర్యాదు



వినతి పత్రాన్ని అందజేస్తున్న యువకులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామంలో 44వ జాతీయ రహదారి నుండి గ్రామంలోనికి వెళ్లాలంటే.. రాత్రి సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చీకట్లో వెళ్లాల్సి వస్తుందని ఆ గ్రామ యువకులు సర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి సౌజన్యకు వినతిపత్రాలను మంగళవారం అందజేశారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన హరితహారం మొక్కల కారణంగా వీధి దీపాలకు అడ్డుగా ఉన్నాయని, దీపాలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించి, రోడ్డుపై వెలుతురు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రిజర్వేషన్ ఉంటదా? ఊడుతదా..?

- అయోమయంలో ప్రస్తుత సర్పంచ్‌లు
- ఆశావాహుల్లోనూ ఆందోళన

నవతెలంగాణ-సదాశివనగర్

రానున్న రోజుల్లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రస్తుత సర్పంచ్‌లతో పాటు, సర్పంచ్ పదవికి పోటీ చేసే ఆశావాహుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుత రిజర్వేషన్ ఉంటుందా? లేదా అనే సందిగ్ధం నెలకొంది.

మండలంలోని పలువురు సర్పంచ్‌లు రిజర్వేషన్‌పై ఆందోళన చెందుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10సంవత్సరాల వరకు గతంలో జారీచేసిన రిజర్వేషన్ మాత్రమే ఉంటుందని జీ.ఓ జారీ చేసింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ప్రస్తుతం సర్పంచ్ పదవిలో ఉన్న కొంతమంది సర్పంచ్‌లు ఇదే రిజర్వేషన్ ఉంటే సర్పంచ్ బరిలో ఉండవచ్చని అనుకుంటున్నారు. ఒకవేళ రిజర్వేషన్ ఉండకుంటే పరిస్థితి ఏంటనేది తేల్చుకోలేకపోతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఇదే రిజర్వేషన్ కొనసాగుతుందా?, లేదా నూతన రిజర్వేషన్‌ను అమలు చేస్తారా? అనే సందేహం ప్రస్తుత సర్పంచ్‌ల్లో, ఆ పదవికి పోటీ చేసేందుకు సిద్ధమవుతు న్న ఆశావాహుల్లో నెలకొంది. ఇదిలా ఉండగా.. మరికొంతమంది సర్పంచ్‌లు, నాయకులు సర్పంచ్ ఎన్నికల కోసం ఇప్పటినుంచే మద్యం డంపింగ్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

బడి బయట పిల్లల గుర్తింపు



నవతెలంగాణ-పిట్లం/వర్ని

బడి బయట పిల్లలను గుర్తించినట్లు జెడ్‌పిహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు గణేష్‌రావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గుడి తాండ, గౌరారం, కరేగావ్‌తాండ ఆవాస ప్రాంతంలోని బడిబయట పిల్లలను సర్వే నిర్వహించి గుర్తించినట్టు పేర్కొన్నారు. వారిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గౌరారం పాఠశాలలలో చేర్పించినట్టు ఆయన తెలిపారు. ఆయా ప్రాంతాల క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు హైమద్ పాషా, విట్టవ్వ కృషికి ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్, రజాక్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

వర్ని(చందూర్): మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఆరు బయట పని చేసే బడి ఈడు పిల్లలపై విద్యాశాఖ ఆదేశాల మేరకు స్కూల్ సిఆర్‌పి సాయిలు ఇంటింటికి సర్వే చేపట్టారు. 6-14 ఏండ్ల పిల్లలు ఆరు బయట వెట్టిచాకిరీ పనులు చేయవద్దని ప్రభుత్వ బడిలో చేరి చదువు కోవాలని, దగ్గరలో ఉన్న పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇటుక బట్టి, హోటల్ యజమానులు బడికి వెళ్లే వయస్సు గల పిల్లలను పనిలో పెట్టుకుంటే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంధ్య రాణి తదితరులున్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

నవతెలంగాణ-బోధన్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో 50 మంది నిరుపేదలకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రస్తుతం చలికాలం సందర్భంగా అత్యధిక చలితో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నందున వారి సౌకర్యార్థం దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ రాధాకృష్ణమూర్తి, గోపాలరావు, శ్రీనివాసరాజు, రామకృష్ణ, లక్ష్మీకాంత్ రెడ్డి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించాలని హోటల్ యాజమాన్యానికి నోటీసులు



నవతెలంగాణ-భిక్కనూర్

మండ లంలోని జంగంపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన నూతనంగా ప్రారంభించిన శ్రీ ఆధ్యా గ్రాండ్ రెస్టారెంట్ అనుమతి కొరకు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో దరఖాస్తు ఫీజు రూ.5,70,000 చెల్లించలేదని, ఇదివరకే ఫీజు చెల్లించాలని రెండు నోటీసులు అందజేసినట్టు పంచాయతీ కార్యదర్శి బాబు మంగళవారం తెలిపారు. ఫీజు చెల్లించకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రాన్ని అంధకారం చేయడమే కాంగ్రెస్ లక్ష్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రాష్ట్రాన్ని అంధకారం చేయటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని బిజెవైఎం మండల అధ్యక్షుడు నరేష్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలుసార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎటువంటి అభివృద్ధి చేపట్టకుండా ప్రజలను హామీలతో మభ్యపెట్టి అధికారం రాగానే సర్దుబాటు వ్యవహారంతో వారిని బుజ్జగించే పనులు చేస్తూ వచ్చిందని పేర్కొన్నారు. నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక కూడా ఇదే రీతిలో ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి ఆచరణకు సాధ్యం కాకపోయినా అధికారం దక్కించుకోవడం కోసం ఇష్టానుసారంగా పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. మహిళలు ఎవరు కూడా ఉచిత బస్సు ప్రయాణం తెలంగాణలో కోరుకోలేదని, దీనివల్ల పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో ఉన్న ఆటో, వివిధ రకాల వాహనదారులు తమ ఉపాధిని కోల్పోతున్నారని అన్నారు. పార్టీకి లాభం చేకూరడం కోసం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో రాష్ట్ర అభివృద్ధిని అంధకారంలోకి తీసుకువెళ్లే విధానాలు, ఆలోచనలు మానుకోవాలని తెలిపారు.

నేడు పత్తి కొనుగోళ్ల బీట్లు ప్రారంభం

- ఏఎంసి సూపర్‌వైజర్ సత్యం

నవతెలంగాణ-మద్నూర్

ఈనెల 13న బుధవారం ఉదయం 10 గంటలకు మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో పత్తి కొనుగోళ్ల బీట్లను జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు ప్రారంభి స్తారని మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ సూపర్‌వైజర్ సత్యం ఒక ప్రకటనలో తెలియజేశారు. పత్తి రైతులు అమ్మటానికి తీసుకువచ్చే పత్తిని నేరుగా మార్కెట్ యార్డులోకి తీసుకురావాలని సూచించారు. పత్తి కొనుగోళ్ల బీట్ల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హాజరవుతున్నందున పత్తి కొనుగోళ్ల వ్యాపారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

బోధన్‌లో గ్రామీణ తపాల ఉద్యోగుల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోధన్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా తపాల ఉద్యోగులు మాట్లాడుతూ.. 8 గంటల పనితో పాటు పెన్షన్ సౌకర్యం సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, కమలేష్ చంద్ర కమిటి సిఫార్సు చేసిన బంచింగ్ విధానం అమలు చేయాలని అన్నారు. సీనియర్ జి.డి.యస్. ఉద్యోగులకు 12, 24, 36, సంవత్సరాల సర్వీసు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ 5లక్షలకు పెంచాలని, యస్.డి.బి.యస్.కు జి.డి.యస్. కాంట్రిబ్యూషన్ 10శాతం, డిపార్ట్మెంట్ 10శాతం కాంట్రిబ్యూషన్ ఇవ్వాలని, అలాగే తాత్కాలిక పెన్షన్ సౌకర్యం కల్పించాలని, రెగ్యూలర్ జి.డి.యస్‌లు సెలవు పెట్టినప్పుడు వర్క్ ఆర్డర్‌కు సంబంధం లేకుండా సబ్‌ట్యూట్‌ను అనుమతించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రాట్యూటి 5 లక్షలకు పెంచాలని, పెయిడ్ సెలవులు 180 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకొను సౌకర్యం కల్పించాలన్నారు. జి.డి.యస్. వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని, ఇన్సెంటివ్, కమీషన్ పద్ధతి రద్దు చేసి జి.డి.యస్‌లు చేసే ప్రతి పనిని వర్క్‌ఆర్డర్‌కు తీసుకోవాలని, టార్గెట్స్, మేళాల రూపంలో జి.డి.యస్. ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్నిరకాల వేధింపులను ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరవధిక సమ్మెలో సాయిలు, అశోక్‌రెడ్డి, గంగాధర్ పటేల్, పాషా, సునీల్, వందన, భాస్కర్, యోగేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న తపాల ఉద్యోగులు

కొనుగోళ్లు పూర్తిచేయడం అభినందనీయం

- వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించిన డిసిఓ



వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించిన డిసిఓ

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రస్తుత సీజన్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయడం అభినందనీయమని జిల్లా సహకార సంఘం అధికారి సింహాచలం అన్నారు. మంగళవారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆయన సందర్శించారు. సహకార సంఘం చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి డిసీఓను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ సుంకరి భూమయ్య, సిఈఓ బైరయ్య, క్లస్టర్ ఆఫీసర్ నగేష్, సిబ్బంది లింగమూర్తి, గంగారాజు, బైరేష్, నవీన్, రాజు, నబీ, చందు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జనరిక్ మెడికల్ ప్రారంభం



ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

బోధన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో త్వరలో జనరిక్ మెడికల్ ప్రారంభించనున్నట్టు సొసైటీ చైర్మెన్ ఉద్మీర్ లక్ష్మణ్ తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన మందులు అందించాలనే ఉద్దేశంతో జనరిక్ మెడికల్ దుకాణం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 6 సొసైటీలకు జనరల్ మెడికల్ దుకాణాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మందుల విక్రయాలతో సొసైటీకి అదనపు ఆదాయం సమకూర్చడానికి ఈ జనరిక్ మెడికల్ వ్యాపారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కావున బోధన్ సమీప ప్రాంతాల వారు జనరిక్ ఔషధాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మనుబ్రహ్మ సంఘం కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని మనుబ్రహ్మ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మనుబ్రహ్మ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా కమ్మరి సాయిలు, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి సురేష్, కోశాధికారిగా భూషణంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మనుబ్రహ్మ సంఘం పెద్దలు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని గండి మాసానిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ఏ.సరోజ తూప్రాన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 13వ తేదీ నుంచి కర్ణాటక రాష్ట్రంలో తుముకురు జిల్లాలో జరిగే జాతీయస్థాయి సబ్‌జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు మొహమ్మద్ అతిఖుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ఖమ్మంలో పది రోజులపాటు జరిగిన నేషనల్ క్యాంపులో మంచి ప్రదర్శన చూపి ప్రోబెబుల్స్ నుంచి మెయిన్ టీమ్ జాతీయస్థాయికి ఎంపికైనందుకు ఉపాధ్యాయ బృందం చాలా గర్వంగా ఉందని, వ్యాయమ ఉపాధ్యాయుడి అతిఖుల్లా పనితీరును ప్రశంసించారు. ఈ ఎంపిక పట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాత మాట్లాడుతూ.. అతిఖుల్లా వచ్చిన తక్కువ సమయంలోనే తమ గ్రామ పిల్లలు జాతీయ స్థాయిలో ఆడడం చాలా సంతోషంగా ఉందన్నారు. పలువురు గ్రామస్తులు, క్రీడాభిమానులు సరోజను అభినందించారు.

అవినీతి జరిగితే చర్యలు

- ఎంపీఓ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధరామేశ్వర నగర్ గ్రామంలో తాళం వేసిన స్టోర్ రూమ్ గదిలో నుంచి బోరు మోటర్ పోవడంతో వార్డు సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. బోరుమోటర్ చోరీ, తీర్మానం లేకుండా బిల్లుల జారీ విషయంలో విచారణ జరుగుతుందని, అవినీతి జరిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెట్రోల్ బంకులో వాగ్వివాదం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామ సమీపంలో గల శ్రీ వెంకటేశ్వర పెట్రోల్ బంక్‌లో నాసీరకం పెట్రోలు, డీజిల్ అమ్మకాలు చేపడుతున్నారని ప్రయాణికులు సిబ్బందిని నిలదీశారు. అలాగే ద్విచక్ర వాహనాలతో పాటు లారీ, కారు ఇతర వాహనాలకు ఎక్కువ డబ్బులు తీసుకుని తక్కువ డీజిల్, పెట్రోల్ పోస్తున్నారని సిబ్బంది తీరుపై వాహనదారులు మండిపడ్డారు. చివరికి పెట్రోల్ బంక్ యాజమాన్యం బంక్‌కు చేరుకొని ఇరువురిని శాంతింపజేశారు. టెక్నికల్ ప్రాబ్లం సమస్య ఉంటే పరిష్కరించుకుంటామని బంక్ యజమాని ప్రయాణికులకు తెలుపడంతో వారు శాంతించారు.

నవతెలంగాణ
నిజామాబాద్
బుధవారం | డిసెంబర్ 13, 2023 | www.navatelangana.com

ఎమ్మెల్యేను సన్మానించిన మామిడిపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా గెలుపొందిన పైడి రాకేష్ రెడ్డిని మంగళవారం వారి స్వగృహం అంకాపూర్‌లో సన్మానించారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పూలమాల, శాలువాతో సన్మానించి కుల సంఘాల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వడ్ల చిన్నారెడ్డి, ప్రణీత్, మనీష్ చారి, రవి, శివకుమార్, కార్తీక్, కొలిప్యాక చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

పసుపు రైతులకు అవగాహన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ రైతు వేదిక భవనంలో మంగళవారం పసుపు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్పైసిస్ బోర్డు నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పైసిస్ బోర్డ్ అడిషనల్ డైరెక్టర్ సుందరేశన్ రైతులకు పసుపు పంటలో మార్కెటింగ్, విలువ ఆధారితలో తీసుకోవలసిన మెలకువలపైన రైతులకు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన స్పైసిస్ బోర్డ్ తరఫున అందజేసే సబ్సిడీల వివరాలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పిప్పర అనిల్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి రమేష్, రైతులు బద్దం రమేష్ రెడ్డి, బద్దం తిరుపతి, కొమ్ముల రంజిత్ రెడ్డి, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.



చంపేస్తానంటూ బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తున్నాయి

- సీపీకి ఆర్మూర్ ఎమ్మెల్యే ఫిర్యాదు

నవతెలంగాణ-ఆర్మూర్

తనను చంపేస్తానంటూ విదేశాల నుండి సైతం బెదిరింపు కాల్స్ వస్తున్నాయని నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలో సిపిని కలిసి ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి జరిపిన మైనింగ్, అక్రమ క్వారీలు, ఆర్టీసీకి సంబంధించిన మాల్‌పై ప్రశ్నించినందుకు బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

జర్నలిస్టులను తోసేసిన ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలి

ఇలాంటివి జరుగకుండా చూస్తా : సీపీ

కంఠేశ్వర్: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద జర్నలిస్టులపై పోలీసులు మంగళవారం దురుసుగా ప్రవర్తించడంతోపాటు జర్నలిస్టులను తోసివేసిన ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అక్కడ ఉన్న పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ స్పందించి మరొకసారి ఇలాంటి విధంగా జరగకుండా చూస్తానని జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. అనంతరం నిజామాబాద్ అడిషనల్ డీసీపీ అడ్మినిస్ట్రేషన్ జయరాం, ఆర్‌ఐ వెంకటప్ప నాయుడు జర్నలిస్టులను తోసి వేయడంతో జర్నలిస్టులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. జర్నలిస్టులు పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తనకు ప్రాణహాని ఉందని సిపి కల్మేశ్వర్ కలిసిన అనంతరం మీడియా వారికి సిపితో మాట్లాడిన విషయాన్ని వివరిస్తుండగా అడిషనల్ సిపి గిరిరాజ్, ఆర్‌ఐ వెంకటప్ప నాయుడు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులను తోసి వేయడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అక్కడే బైఠాయించి పోలీసుల జులుం నశించాలి అంటూ నినాదాలు చేశారు. జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన ఆర్‌ఐపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం సిపి మీడియా జర్నలిస్టులను చాంబర్‌కు పిలిపించుకొని మాట్లాడారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



జర్నలిస్టులకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

- బూడిదైన డబ్బులు, బంగారం, వస్తువులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని దేవి తండాలో సోమవారం రాత్రి ప్రమాద వశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నివాసపు గుడిసె దగ్దం అయినట్లు బాధితులు, తండావసులు తెలిపారు. స్థానికులు, మండల రెవెన్యూ అధికారి తాళ్ళ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవి తండాకు చెందిన దేగావత్ అనూష కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల వద్దకు వెళ్లారని రాత్రి సమయంలో ప్రమాద వశాత్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె లో దాచి ఉంచిన రెండు లక్షల రూపాయల నగదు, రెండు తులాల బంగారం చైన్, రెండు తులాల వెండితోపాటు వంట సామాగ్రి, దుస్తులు విలువైన పత్రాలు అగ్నికి అహుతైనట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని మండల రెవెన్యూ అధికారికి తెలుపగా వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు. దళిత కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని పలుపార్టీలకు చెందిన నాయకులు విన్నవించారు.



దగ్ధమైన గుడిసె

యాసంగి పంటల నమోదు చేపట్టాలి

- నకిలీ విత్తనాలపై నిఘాపెట్టాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యాసంగి పంటల నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టాలని, నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు మంగళవారం మండలం లోని నడిపల్లి గ్రామంలోని రైతు వేదికలో ఎడిఎ, మండల వ్యవసాయ శాఖ అధికారులు మండల వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ మాట్లాడుతూ యాసంగి పంటల సాగుపై అధికారులు సిద్ధంగా ఉండి, ప్రణాళికలు చేసుకోవాలని, రైతుల అవసరాల దృష్ట్యా ఎరువులు, నకిలీ విత్తనాల సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచి రైతులకు ఎటు వాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో యాసంగి నమోదు కార్యక్రమం చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఏడిఏ ప్రదీప్ కుమార్, రాంబాబు, ప్రవీణ్ కుమార్ తో పాటు అదికారులు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న వాజీద్ హుస్సేన్

ఉపాధి శిక్షణ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈజీఎంఎం ద్వారా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఉపాధి నిర్వహించబడునని ఈజీఎంఎం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ భవనంలో శిక్షణ తరగతులకు దరఖాస్తులు ఈనెల 18 లోపు చేసుకోవాలని, నిజామాబాద్ జిల్లాలోని నూతన కలెక్టర్ కార్యాలయం దగ్గర న్యాక్ శిక్షణ భవనంలో ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డ్, ఫుడ్ సెక్యూరిటీ కార్డ్, బ్యాంక్ అకౌంట్, ఫొటోస్ -2 తీసుకొని రావాలని తెలిపారు. ఉచిత హాస్టల్ వసతి, స్టేషనరీ (బుక్,పెన్),యూనిఫాం(టీ -షర్ట్స్, బ్యాగ్స్) ఉచితంగా అందించబడునని, ఎలక్ట్రికల్ విభాగంలో అన్ని రకాల ప్రాక్టికల్స్ హౌజ్ వైరింగ్, ఫ్యాన్ రిపేర్, ఏసీ రిపేర్, ట్రాన్స్‌ఫార్మర్లు నేర్పించబడునని పేర్కొన్నారు. ల్యాండ్ సర్వేయర్ విభాగంలో ఆటో లెవెల్, ఆఫ్ సెట్ సర్వేయింగ్, ట్రవెర్సింగ్ నేర్పించబడునని పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్, డిగ్రీ చదివినవారు 18 - 35 సంవత్సరాల వయస్సువారు అర్హులని తెలిపారు. అనంతరం సర్టిఫికెట్‌తోపాటు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చూపించబడునని పేర్కొన్నారు. సమాచారం కోసం ల్యాండ్ సర్వేయర్ సరోజ -7981360101, ఎలక్ట్రికల్ లింబాద్రీ- 8498867895, దిలీప్- 9704587655 లను సంప్రదించండి అని అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.ప్రభాకర్ -6281992068 ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్'లో ఎలక్షన్ ప్రక్రియను రూపొందించారు. విద్యార్థులు రూపొందించిన యంత్రంలో పాఠశాల విద్యార్థులు మొత్తం 403 గాను 370 మంది విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించారు. ఉపాధ్యాయులు సూచించిన విధానానికి భిన్నంగా నూతన పద్ధతిలో ఓటింగ్ యంత్రం రూపొందించారు. విద్యార్థులు రూపొందించిన యంత్రంను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యం.గంగారాం, స్ఎంసీ ఛైర్మెన్ శ్రీమాన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్

జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహూ ఇంటిపై జరిగిన ఐటీ దాడుల్లో 353 కోట్ల రూపాయల అవినీతి డబ్బు బయటపడడాన్ని నిరసిస్తూ, బిజెపి రాష్ట్ర శాఖ పిలుపుమేరకు పట్టణ అధ్యక్షులు ద్యాగ ఉదయ్ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు, నూతుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే అవినీతికి మారుపేరని. కాంగ్రెస్ స్కాంగ్రెస్‌గా మారి 70ఏండు పరిపాలించి దేశం మొత్తాన్ని అవినీతి మయంగా మార్చిందని అన్నారు. దాంట్లో భాగంగానే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా 353 కోట్ల అవినీతి డబ్బులు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీ దిరాజ్ సాహు ఇంట్లో ఉంచినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఇంత అవినీతి జరుగుతున్నా కూడా కాంగ్రెస్ పార్టీ ధీరజ్ సాహూను పార్టీ నుండి కానీ ఎంపీ పదవి నుండి కానీ సస్పెండ్ చేయకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఎమ్మెల్యేలను కలిసిన ఎంప్లాయిస్ నాయకులు, ఉద్యోగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన, నిజామాబాద్ అర్బన్, రూరల్ నూతన శాసనసభ్యులు దన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డిని టీఎన్జీవోస్ పక్షాన మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అలుక కిషన్, టీజీవో జిల్లా అధ్యక్షులు సంఘం అమృత కుమార్, టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ , సహధ్యక్షులు చిట్టి నారాయణ రెడ్డి , టీఎన్జీవో కేంద్ర సంఘ బాధ్యులు పోల శ్రీనివాస్, సతీష్ కుమార్, సలహాదారులు ఆకుల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విద్యుత్ శాఖ అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని విద్యుత్ అధికారులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో డీఈ హరిచంద్, ఏడిఈలు శ్రీధర్, రాజేశ్వర్, ఏఈలు ఆశ్రీత రెడ్డి, శ్రవణ్, భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

ఎమ్మెల్యే భూపతిరెడ్డికి పలువురి సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి/మోపాల్

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో శాసనసభ్యులుగా ఎన్నికైన బూపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా నియోజకవర్గ ఏపిఎంలు శాలువాతో సన్మానించి పూల బొకేలు అందజేశారు. కార్యక్రమంలో మునిపెల్లి సర్పంచ్ చిన్న సాయిరెడ్డి, జక్రాన్ పల్లి, నిజాంబాద్ రూరల్, ఇందాల్ వాయ్, ధర్పల్లి, మోపాల్ ఏపీఎంలు రవీందర్ రెడ్డి, మహేష్, సువర్ణ, సునీత తదితరులు ఉన్నారు.



జక్రాన్‌పల్లి : సన్మానిస్తున్న ఏపీఎంలు

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి మండల మహిళా మ్యాక్స్ సభ్యులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎమ్మెల్యేగా గెలుపొందిన భూపతిరెడ్డిని మండల మహిళా మ్యాక్స్ కార్యవర్గ సభ్యులు పూలబొకేలు అందజేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి గన్న లక్ష్మణ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, కాటిపల్లి నర్సారెడ్డి, మ్యాక్స్ కార్యవర్గ సభ్యులు ఎల్లవ్వ, బుచ్చమ్మ, విజయ, మ్యాక్స్ మేనేజర్ సమీనా తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మండల కేంద్రానికి చెందిన గంగపుత్ర సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి పూల బొకేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి గన్న లక్ష్మణ్, మండల యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, కాటిపల్లి నర్సారెడ్డి, గంగపుత్ర సభ్యులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడి పూజలో నిజామాబాద్ రురల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి ఒడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కంచెట్టి గంగాధర్, ముప్ప గంగారెడ్డి, డాక్టర్ శాదుల్లా, దర్మగౌడ్ న్యాస రాజేశ్వర్,ఇందల్ వాయి మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, అమృత పూర్ గంగాధర్, పోలసాని శ్రీనివాస్,తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అంగన్వాడీ టీచర్లు

మోపాల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా తమ సమస్యల తీరుతాయని ఆశాభావంతో ఉన్నామని, సమస్యలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేని వారు కోరారు. డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ కచ్చితంగా సమస్యలకు పరిష్కారం ఉందని, సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, అంగన్వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి సరిత, తదితరులు పాల్గొన్నారు.



మోపాల్ : సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



సీపీని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

సిపిని కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్/ నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగర శాసనసభ్యులు దన్‌పాల్ సూర్యనారాయణ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌ని మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు వారు నగర లా అండ్ ఆర్డర్ పై చర్చించారు. నగరంలో శాంతి భద్రత విషయంలో అన్ని విధాలా సహకరిస్తామని అర్బన్ శాసనసభ్యులు దన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి సబ్ డివిజన్ పరిదిలో గల నాలుగు మండలాలు సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల విద్యుత్ వినియోగదారులకు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక గడ్కోల్ 33/11కేవీ సబ్-స్టేషన్‌లో ఈనెల 13న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 01 గంట వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యుత్ వినియోగదారుల యొక్క ఎటువంటి సమస్యలు ఉన్నా ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూరల్ ఎమ్మెల్యేను కలిసిన టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్. భూపతి రెడ్డి ని టీఎస్ యుటిఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. సత్యానంద్, ఓ. రమేష్ , జిల్లా కమిటీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-బాల్కొండ

మండలకేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలను మంగళవారం మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థుల కోసం పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎం జె పి ఇన్చార్జి ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయిని బృందం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రెంజర్ల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థి పి.సంజయ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జక్కుల రవి తెలిపారు. 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ బాలుర విభాగంలో తమ పాఠశాల విద్యార్థి ఎంపికనట్లు ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు ఆనంద్ పేర్కొన్నారు. ఈ నెల 13 నుండి 15 వరకు మహబూబ్ నగర్ జిల్లాలోని నారాయణపెట్‌లో జరిగే వాలీబాల్ పోటీల్లో విద్యార్థి పాల్గొంటారని అన్నారు. ఎంపికైన విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అక్రమ మొరం ట్రాక్టర్ సీజ్



నవతెలంగాణ-పిట్లం

పర్మిషన్ లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్ చేసి రూ.3 వేలు జరిమానా విధించినట్లు డిప్యూటీ తహసిల్దార్ నరేష్ తెలిపారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం నుండి ఎలాంటి పర్మిషన్ లేకుండా మొరం తరలించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఎవరైనా మొరం అవసరం ఉన్నట్లయితే ఎన్ని ట్రాక్టర్లు అవసరమో వాటికి చాలన్ రూపంలో డబ్బులు చెల్లించి తరలించాలని సూచించారు. రాత్రి వేళల్లో మొరం తరలించినా, అమ్మినా చత్యరీత్యా నేరమని, ఎవరైనా మొరం రవాణాకు పాల్పడితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

జుక్కల్ ఎమ్మెల్యేను కలిసిన పోలీస్ అధికారులు



నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తోట లక్ష్మీకాంతరావును జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద సీఐ కృష్ణ, మద్నూర్ ఎస్సై కృష్ణారెడ్డితో పాటు బిచ్కుంద, జుక్కల్, పెద్దకొడప్గల్, పిట్లం, నిజాంసాగర్ ఎస్సైలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తోట లక్ష్మి కాంతారావును మొట్టమొదటిసారిగా కలిసిన ఆరు మండలాల ఎస్సైలు, బిచ్కుంద సీఐ అభినందనలు తెలియజేశారు. పోలీస్ అధికారులకు నూతన ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

సక్రమంగా విధులు నిర్వహించట్లే..

- అధికారుల పనితీరుపై
- మండల సభ్యుల తీవ్ర ఆగ్రహం



సమావేశానికి హాజరైన పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

అధికారులు మండలంలో సక్రమంగా విధులు నిర్వహించడం లేదని నామమాత్రంగానే పనిచేస్తున్నారని మండల సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సభ్యులు మాట్లాడుతూ.. మండలంలోని కరడుపల్లి గ్రామంలో కరెంటు సమస్యలు ఉన్నాయని గత మూడు మండల సర్వసభ్య సమావేశాలలో అధికారులకు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని కరడుపల్లి సర్పంచ్ వడ్ల బాలచంద్రం, ఎర్రపహాడ్ ఎంపీటీసీ సభ్యులు జలంధర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు అధికారులు మండలంలో విధులు నిర్వహిస్తున్నారా, మీరు ఎక్కడ పని చేస్తున్నారని ట్రాన్స్‌కో ఏఈ కరుణాకర్, సబ్ ఇంజనీర్ భాస్కర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించనిది మండల సర్వసభ్య సమావేశాలు ఎందుకు నిర్వహిస్తారని ఎంపీడీవో రాజువీర్‌ను సభ్యులు ప్రశ్నించారు. క్రీడా ప్రాంగణాలు నిర్మించి నెలలు గడుస్తున్న ఇప్పటికీ బిల్లులు రావడం లేదని సర్పంచులు బండారు సంజీవులు, బాలచంద్రం తీవ్రంగా మండిపడ్డారు. ఉపాధిహామీ ఏపీవో శృతిపై సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడా ప్రాంగణాలకు రూ.4లక్షలు ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పగానే తాము క్రీడా ప్రాంగణాలను నిర్మించామన్నారు. కానీ కేవలం రూ.92వేలు ఎంబీ రికార్డులు చేయడంపై సర్పంచులు ఏపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత తక్కువ ఎంబి రికార్డు ఎలా అవుతుందని నిలదీశారు. తాము క్రీడా ప్రాంగణాలు నిర్మించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ బిల్లు రాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఏపీవో శృతి సరైన సమాధానం చెప్పకపోవడంతో ఏపీఓపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గ్రామాలలో పైప్‌లైన్లు లీకేజీ అయినా పట్టించుకోరా అని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్‌ను జెడ్పిటిసి రమాదేవి ప్రశ్నించారు. బ్రాహ్మణపల్లిలో డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ లీకేజీ అయి తాగునీరు అంతా కలుషితమవుతుందని ఈ విషయమై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఏఈని నిలదీశారు. పైపులైన్ల లీకేజీ విషయం తనకు తెలియదని లీకేజీలైతే గ్రామపంచాయతీనే లీకేజీలకు మరమ్మతులు నిర్వహించాలని ఏఈ వినోద్ జెడ్పిటిసికి తెలిపారు. నందివాడ మహిళా సంఘంలో సిఏ బాబా గౌడ్ రూ.36లక్షలు నిధులు స్వాహా చేసినా ఇప్పటికీ రికవరీ ఎందుకు చేయడం లేదని సభ్యులు ఏపిఎంను ప్రశ్నించారు. తాడ్వాయి శ్రీ శబరిమాత కుంటకు నిర్వహించిన పనులు పూర్తిగా నామమాత్రంగా జరిగాయని కట్ట నిర్మించిన ఏడాదికే కృంగిపోతుందని సర్పంచ్ సంజీవులు, వైస్ ఎంపీపీ నర్సింలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కట్ట పనులు ఇంత నామమాత్రంగా చేస్తే ఎలా అని మండిపడ్డారు. వైద్యాధికారి మండల సమావేశానికి రారా? ఆమె సక్రమంగా విధులు నిర్వహించడం లేదని సభ్యులు తెలిపారు. సమస్యలు పరిష్కరించకుండా మండల సర్వసభ్య సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని అధికారులను సర్పంచులు, ఎంపీటీసీలు నిలదీశారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకుంటే తాము తీవ్ర ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రమాదేవి, సదాశివనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పులగం సాయిరెడ్డి, డిసిఎంఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, తహసిల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెగాడపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ జైనాబి (100) అనే వృద్దురాలు మంగళవారం మృతిచెందింది. గ్రామంలో ఏకైక శతాధిక వృద్దురాలిగా జీవించిందని గ్రామస్తులు తెలిపారు. వంద సంవత్సరాలకు పైబడి జీవించిన వృద్దురాలు అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతికి గ్రామస్తులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వృద్దురాలికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని గ్రామస్థులు తెలిపారు.

ఈకేవైసీ కోసం ఇబ్బందులు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీల వద్ద దోమకొండ, బీబీపేట్, భిక్కనూర్, రాజంపేట్ మండలాల గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేవైసీ చేసుకునేందుకు వరుసలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంటున్నారు. సర్వర్ రాకపోవడంతో వెనుదిరగాల్సి వస్తోందని వారు చెబుతున్నారు.

దోమకొండ గ్యాస్ ఏజెన్సీలు ఈ కేవైసీ చేయించుకోవాలని ప్రకటనలు చేయడంతో వినియోగదారులు ఏజెన్సీల వద్ద గుమిగూడుతున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు ఈకేవైసీకి గడువు ఉందని స్పష్టం చేసినా వినియోగదారులు పట్టించుకోకుండా ఈకేవైసీ చేయించుకోవడానికి పోటీ పడుతున్నారు. ఈ విషయంలో వినియోగదారులకు ఆయాశాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని పలువురు పేర్కొంటున్నారు. గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ లింక్ చేసుకునే గడువు ఈ నెల 31 వరకే ఉందని ప్రచారం జరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రెంజల్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్

నవతెలంగాణ-రెంజల్

67వ రాష్ట్రస్థాయి పోటీలకు రెంజల్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ మమ్మాయి నాగరాజు పేర్కొన్నారు. అండర్ 14 బాలబాలికలు హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని వారు అన్నారు. ఈనెల 8 నుంచి 10 వరకు మంచిర్యాల్ జిల్లా భీమారం జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో జరిగే పోటీలలో వారు పాల్గొన్నారు. భావన, చరణ్‌రాజ్, రంజిత్ ఎంపికయ్యారని వారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించాలని ఎస్ఎంసి కమిటీ చైర్మన్ నాగరాజ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బలరాం, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ మమ్మాయి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బస్సులు ఫుల్..
మహారాష్ట్ర బస్సులు నిల్



నవతెలంగాణ-బిచ్కుంద

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఎన్నికల్లో ప్రకటించిన ఆరు పథకాల అమలులో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో పల్లె వెలుగులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళలతో కిక్కిరిసిపోతున్నాయి. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర బస్సులు ముఖేడ్, దెగ్లూర్, హింగోలి, నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు బిచ్కుంద ద్వారా పదుల సంఖ్యలో బస్సులు ప్రయాణికులను గత ముప్పై సంవత్సరాల నుండి వారి గమ్యస్థానాలకు చేరుస్తూ నడుస్తున్నాయి. ఉద్గీర్ నుంచి నిజామాబాద్‌కు రోజుకు మూడు బస్సులు నడుస్తుండగా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో మహిళలతోపాటు మగవాళ్ల కూడా ఆర్టీసీ బస్సులో వెళ్లడంతో మహారాష్ట్ర బస్సు ఎక్కే వాళ్లు కరువయ్యారు. దీంతో మహారాష్ట్ర బస్సుల ఆదాయం 60 నుంచి 70 శాతం వరకు పడిపోయిందని కండక్టర్, డ్రైవర్‌లు ఆవేదనతో తెలిపారు. 25 సంవత్సరాలుగా మహారాష్ట్ర బస్సుల ద్వారా ఎంతో మంది ప్రయాణికులను సమయానికి గమ్యం చేర్చి సేవలందించినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో మహారాష్ట్ర బస్సులు ఎక్కేవారు లేక డీజిల్ ఖర్చులు వచ్చే పరిస్థితి కూడా కనపడటం లేదని మహారాష్ట్రకు చెందిన బస్ కండక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే 30 సంవత్సరాల నుంచి ప్రయాణికులను గమ్య స్థానాలు చేరుస్తూ సేవలు అందిస్తున్న మహారాష్ట్ర బస్సులు రద్దయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

డిమాండ్లు పరిష్కరించాలి

- నిరవధిక సమ్మెలో బీపీఎంలు



సమ్మెలో పాల్గొన్న బీపీఎంలు

నవతెలంగాణ-లింగంపేట్

తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గ్రామస్థాయి తపాలా శాఖ నిర్వాహకులు మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బిపిఎంలు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీపీఎంల నాయకులు లింగం మాట్లాడుతూ.. 8గంటల పనితో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పలుసార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా, ఇప్పటివరకు పరిష్కరించలేదని ఆయన మండిపడ్డారు. తపాల శాఖలో పనిచేస్తున్న బీపీఎంలకు ఐదులక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నగదు మార్చుకునే సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఉద్యోగులతో నిర్వాహకులతో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. జీడిఎస్, డిపార్ట్‌మెంట్ కంట్రిబ్యూషన్ మూడు నుండి 10 శాతానికి పెంచాలన్నారు. అదేవిధంగా ఇన్సెంటివ్ కమీషన్ పద్ధతిని రద్దు చేయాలని అన్నారు. జిడిఎస్‌లు పనిచేసే ప్రతి పనినీ వర్క్‌లోకి తీసుకోవాలని కోరారు. ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, బ్రాడ్‌కాస్టింగ్, నెట్‌వర్క్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని వారి డిమాండ్ చేశారు. ఈ నిరవధిక సమ్మెలో నితీన్‌రెడ్డి, వర్ష, రమ్య, మనూష, మారుతి, రాహుల్, వినోద్, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

- రెండింటినీ ఒకేలా స్వీకరించాలి
- జాయింట్ సెక్రెటరీ సక్రు నాయక్

నవతెలంగాణ-రామారెడ్డి

ఆటల్లో గెలుపోటములు సహజమేనని, రెండింటినీ ఒకేలా స్వీకరించాలని.. ఓడినవారు ఎలాంటి ఆత్మన్యూనతకు లోను కాకూడదని సాంఘిక సంక్షేమ గురుకుల జాయింట్ సెక్రెటరీ సక్రునాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో 9వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు 4వ రోజు ప్రశాంతంగా ముగిశాయి. అండర్ 14 ఛాంపియన్ కే ప్రవీణ్ (హుజూర్‌నగర్), అండర్ 17 జి.రాజేష్ (చిలుకూరు), అండర్ 19 ఏ గణేష్ (లింగాల) విజేతలను సత్కరించారు.

పలువురిని శాలువాతో సన్మానించి జ్ఞాపి కను అందజేశారు. కార్యక్ర మంలో రీజినల్ కోఆర్డినేటర్ అలివేలి, స్థానిక జెడ్పిటిసి నారెడ్డి మోహన్‌రెడ్డి, సర్పంచ్ కొత్తొళ్ల గంగారం, నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.



జ్ఞాపికను అందజేస్తున్న సక్రు నాయక్

బడి బయట పిల్లల సర్వే



ఎల్లారెడ్డిలో బడిబయట పిల్లల సర్వే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్

బడిబయట పిల్లల సర్వేలో భాగంగా మంగళవారం వెల్లుట్లపేట ఆపిటేషన్ పరిధిలో సర్వే నిర్వహించినట్లు సిఆర్‌పి మహిపాల్ తెలిపారు. సర్వేలో భాగంగా ఒక బాలికను, ముగ్గురు బాలురులను గుర్తించి స్థానిక పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. అదేవిధంగా డ్రాప్ ఔట్స్ విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాలలో మంగళవారం బడి బయట పిల్లల సర్వేను క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నిర్వహించారు. మండలంలోని లింగంపేట్, బాణాపూర్ తదితర గ్రామాలలో బడి బయట పిల్లల కోసం సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఇద్దరు బడి బయట పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం సంబంధిత పాఠశాలలో చేర్పించామన్నారు. నెలరోజులపాటు బడి బయట పిల్లల సర్వే కొనసాగుతుందన్నారు. తమ పిల్లలను అర్ధాంతరంగా బడి మాన్పించవద్దని తెలిపారు. ఈ సర్వేలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ గంగాధర్, సంజీవ్, ఉపాధ్యాయులు షౌకత్ హాలీ తదితరులున్నారు.



లింగంపేట్‌లో సర్వే..

మంత్రి సీతక్కను కలిసిన ఐకెపి వివోఏ ఉద్యోగ నాయకులు



సీతక్కను కలిసిన ఐకేపీ వీవోఏ ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

హైదరాబాద్‌లోని హైదర్‌గూడా న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మంగళవారం ఐకెపి వివోఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కలిసి శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో ఐకెపి వివోఏ ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పఠాన్ గౌస్ ఖాన్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివరాం నాయక్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు మణెమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంగావిక్రమ్, లింగంపేట్, మాచారెడ్డి, రామారెడ్డి, రాజంపేట, సదాశివనగర్, గాంధారి, దోమకొండ, పిట్లం మండల అధ్యక్షులు కొర్పోల్ పోషన్న, అంకం కిషోర్ కుమార్, గిద్దె శ్రీకాంత్, అమర్ల బండ రాజయ్య, సాయి, సుధీర్ గోపాల్‌రావు, బసవన్నపల్లి రాజిరెడ్డి, డాక్టర్ రమేష్, మార్దండ రవి, రజినీకాంత్, దొడ్లే లత, మంత్రి అనసూయ, బాలమణి తదితరులు మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- తపస్ జిల్లా బాధ్యులు రచ్చ శివకాంత్



మాట్లాడుతున్న రచ్చ శివకాంత్

నవతెలంగాణ-బిచ్కుంద

నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎస్ రద్దుపై చర్యలు తీసుకోవాలని తపస్ జిల్లా బాధ్యులు రచ్చ శివకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం బిచ్కుంద మండల కేంద్రంలోని ఎస్సివాడ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జుక్కల్ శాసనసభ్యులు తోటలక్ష్మీకాంతరావుకు శుభాకాంక్షలు తెలిపారు. తపస్ జిల్లా బాధ్యులు రచ్చ శివకాంత్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కావెంజర్స్ నియామకం చేపట్టాలని, 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు తిరిగి వారి సొంత జిల్లాలకు పంపాలని, ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, 200ల యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్న దష్ట్యా ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ ఉచిత కరెంటు ఇవ్వాలని అన్నారు. కేజీబీవీలలో పని చేస్తున్న ఎస్‌ఓ, సిఆర్‌టి, పిజిసిఆర్‌టిలకు రెగ్యులర్ చేయాలని, కేజీబీవీ పాఠశాలలో వార్డెన్ల నియామకం చేపట్టాలని, కేజీబీవీ ఉపాధ్యాయినీలకు రెండవ శనివారం సెలవు ఇవ్వాలని, సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న ఎంఐఎఫ్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఆర్ట్ క్రాఫ్ట్ టీచర్లను సిఆర్పీ, ఐఈఆర్టీ, మెసెంజర్లు ఇతర కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ చేసి టైం స్కేల్ ఇవ్వాలని అన్నారు. ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టు మంజూరు చేయాలని, ట్రాన్స్‌ఫర్ పదోన్నతులు అధ్యయనం చేసి బదిలీలు ప్రమోషన్లు పారదర్శకంగా చేపట్టాలని, పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నామని అన్నారు. ఆయన వెంట ఉపాధ్యక్షురాలు స్వరూప, బాన్సువాడ డివిజన్ కార్యదర్శి ఎన్నావార్ రాజకుమార్, అధ్యక్షులు సంజయ్, ప్రధాన కార్యదర్శి సందీప్, సభ్యులు సత్య, గంగామని, భీమ్రావు ఉన్నారు.

బైపాస్ రహదారి బాధితుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల సమీపంలోని శివారు ప్రాంతంలో నుంచి జాతీయ రహదారుల విభాగం అధికారులు నూతనంగా వేస్తున్న బైపాస్ రహదారి వలన తమ పంట పొలాలకు సాగునీరు అందని పరిస్థితి తలెత్తిందని, కావున సంబంధిత శాఖ అధికారులు బైపాస్ రహదారి వలన తమ పంట పొలాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం సమీప ప్రాంతాల నిరుపేద రైతులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి నిరసనకు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్ మద్దతు తెలిపి మాట్లాడుతూ.. బైపాస్ రహదారి నిర్మాణంలో అధికారుల అనాలోచిత నిర్ణయాలతో నిరుపేద రైతుల పంటలకు సాగునీరు అందని పరిస్థితి ఉందని, కావున అధికారులు తక్షణమే స్పందించి రైతులకు ఇబ్బందులు కలగకుండా రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసనలో రైతులు రాజమణి, ఉజ్వల, సాలెన్ సంజీవ్, కన్నె సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎమ్మెల్యేను కలిసిన బిజెపి నాయకులు

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని చుక్కాపూర్ గ్రామ బిజెపి నాయకులు మంగళవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందినందుకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు వేణురెడ్డి, స్వామిగౌడ్, రాజాగౌడ్, పాపాగౌడ్, దేవరాజుగౌడ్, చరణ్‌గౌడ్, గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

